## ఆనాటి సంఘజీవనం

ముందు చదువు దృష్ట్యా తరువాత ఉద్యోగ రిత్యా వూరికి దూరం అయిన నేను చాలా సంవత్సరాల తరువాత పుట్టి పెరిగిన మా అమ్మమ్మ గారి వూరికి వెళ్ళాను. ఎప్పుడూ ఆ వూరి గురించి తలుచుకొన్నప్పుడల్లా నాకు ఏదో పోగొట్టుకొన్న అనుభూతి, ఎప్పుడు వెళ్లి వెతుక్కోవాలా అనిపిస్తూ ఉంటుంది. ఆ వూరి పొలిమేరలోకి అడుగు పెట్టిన దగ్గరనుండి అమ్మమ్మ గారి ఇంటి గుమ్మం చేరే వరకు ఏవోవో అనుభవాలు, చిన్న నాటి జ్ఞాపకాలు గుర్తుకు వస్తూనే ఉన్నాయి. ఎంతైనా భాద్యతలు లేని బాల్య జీవితం గడిపిన వూరు కదా మరి!

అ వూరి గురించి సంక్షిప్తంగా చెప్పాలంటే!

అది గోదావరి మధ్యలో సాగర సంగమానికి ఆమడ దూరం లో ఉన్న ఒక అందమైన కోనసీమ కుగ్రామం. కాటన్ దొర పుణ్యమా అని ఎల్లప్పుడూ నిండు గా నీరున్న చెరువులు, కాలువలతో, పచ్చని కొబ్బరి చెట్లతో మరియు పాడి పంటలతో తులతూగే అ వూరు అతిధి మర్యాదలకు సంస్కృతి సాంప్రదాయాలకు ఒక ఉదాహరణ అని చెప్పుకోవచ్చు. బహుశా అ ప్రశాంత వాతావరణ మహిమో! కూడు, గూడు, నీడ లకు కరువు లేక పోవటం వల్లనో! లేదా నిరంతర ఆధ్యాత్మిక చింతన వల్లనో! ఏదైతేనేం ఊరందరూ కలసి ఎల్లప్పుడూ ముక్తకంఠం తో అతిధి దేవోభవ అన్నట్లు గా అనిపిస్తుంటుంది నాకు.

---------****----------

చిన్ననాటి అనుభవాలను నెమరు వేసుకొంటూ, మధ్య మధ్యలో కనబడిన వారిని పలుకరిస్తూ అమ్మమ్మ గారింటి ముందు వాలాను ఏదో తెలియని ఆత్రుతతో

ఇంటి గుమ్మం లో ఉన్న నన్ను చూసి,

రండి రండి అందరూ ఎలా ఉన్నారు, ఎప్పుడు వచ్చారు అంటూ పలకరిస్తూనే. అమ్మా మంచినీళ్ళు తీసుకొని రా! బావ వచ్చారు అంటూ కూతురిని పిలిచేరు మా అత్తయ్య.

ఇంకా ఏవేవో కుశల ప్రశ్నలు వేస్తూ, తమ సాధక బాధకాలు చెప్పుకొంటూ పోతున్నారు..

ఆవిడ మాట్లాడుతూనే ఉన్నారు, నేను వింటూనే ఉన్నాను. కానీ అవి ఏవీ నా తలకు ఎక్కుతున్నట్లు లేవు. ఆవిడ మాటలకు అడ్డుతగిలి, మావయ్య లేరా? అని అడిగాను.

నేనూ అదే చెప్పబోతున్నాను! మీరు సరైన సమయానికే వచ్చారు. మీరు వచ్చిన వేళావిశేషమేమో పెద్ద గేదె ఈనుతున్నదట, కబురు వస్తే ఇప్పుడే హడావిడి గా పొలానికి వెళ్ళారు అన్నారు.

ఏదైనా మంచి జరిగితే, అది మీ వల్లనే జరిగిందని ఆ సమయంలో అక్కడికి వచ్చిన వ్యక్తి కి ఆ అదృష్టాన్ని కట్టబెట్టటం పరిపాటి. ఈ విధంగా తమ ఆనందాన్ని మరొకరితో పంచుకోవటం ఒక మంచి ఆనందరకమైన గ్రామీణ ఆనవాయతీ అని చెప్పుకోవచ్చు.

ఇంతలో ఇంటర్ పూర్తి చేసి పెద్దలు అంటున్న పెళ్ళా తనకిష్టమైన పై చదువులా అని ఆలోచిస్తూ ఉన్న18 ఏళ్ల మా మావయ్య కూతురు ఎదురైంది మంచినీళ్ళ గ్లాసు తో. బావున్నారా బావా, అక్కా పాపా ఎలా ఉన్నారు అంటూ నవ్వుతూ.

ఈ లోగా మా మావయ్య రానే వచ్చారు ఒక పాలతపేలా సైకిల్ కి కట్టుకొని.

ఎలా వున్నావు రా? ఎప్పుడు వచ్చేవు అని అడుగుతూనే నువ్వు వచ్చిన వేళావిశేషమేమో పెద్ద గేదె ఈనింది.

ఇంకా చాలా విషయాలు చెప్పుకుపోతున్నారు(వ్యవహారికం లో), గేదె చాలా మంచిదని, అమ్మమ్మ పుట్టింటినుండి తీసుకొని వచ్చిన జాతి అని. పెయ్యి దూడను పెట్టిందని, 3 లీటర్ల ముఱ్ఱి పాలు ఇచ్చినదని మరెన్నో వ్యవసాయ విశేషాలు, కష్ట సుఖాలు

ఇప్పటి వరకు ఇంటిల్లపాది వేసిన కుశల ప్రశ్నలను, మర్మంలేని పలకరింపులు, నా రాక తో వాళ్ళు పడ్డ ఆనందాన్ని చూసి ఉవ్విళ్ళూరుతున్న నేను మరొకసారి నాలో నేనే ప్రశ్నించుకొన్నా!

పల్లెటూళ్ళు కూడా ఆధునీకరణకు లోనై కొట్టుమిట్టాడుతున్నాయి అని ఎవరు అన్నారని?

మావయ్య చేతి లో పాలు తీసుకొని మంచినీళ్ళ గ్లాసు చేతికి అందించి, కాళ్ళు కడుక్కోండి వేడి వేడి గా భోజనం వడ్డిస్తా అన్నారు అత్తయ్య ఇద్దరినీ ఉద్దేశించి.

భోజనం చేస్తూ ఉండగా అత్తయ్య మావయ్య ల మధ్య సంభాషణ ఇది

జున్ను వండటానికి పాలు కావాలి! (అత్తయ్య)

(సాధారణంగా జున్ను తయారు చేయటానికి ముఱ్ఱిపాల వంతు కు సుమారు 3 లేదా 4 వంతుల మామూలు పాలు కలుపుతారు)

ఇంట్లో లేవా? (మావయ్య)

2 లీటర్లు ఉంటాయి మరొక లీటరైనా కావాలి.

వెంకన్న ను అడగక పోయావా?

లీటరు పాలకు 2 లీటర్లు నీళ్ళు పోసిస్తాడు, జున్ను సరిగా అవ్వదు.

సరేలే సాయంకాలం పాల కేంద్రం నుండి తెప్పిస్తాను.

తొందరగా తెప్పించండి, మిగతా పాలు(అంటే సుమారు 2 లీటర్లు పాలు) సర్దిపెట్టె (ఫ్రిజ్)లో పెట్టేస్తాను.

ఈ సంభాషణ వింటూంటే కొంచెం క్రొత్తదనం కనిపించినట్టనిపించింది నాకు.

భోజనం అయిన తరువాత పెరట్లో చెట్టు నీడ క్రింద ఉన్న ఓ పడక కుర్చీలో జారబడ్డాను.

అనుకోకుండానే మెల్లగా చిన్ననాటి ఆలోచనల్లోకి జారుకొన్నా..

---------****----------

ఒసేయ్ కాముడూ మాస్టారి గారి గేదె ఈనిందట, సాయంకాలం కాస్త పాలు పంపించవోయ్
మాస్టారి గారి భార్య మడికట్టుకొని మరీ జున్ను వండుతారులే ! (రెండిళ్ళ అవతల ఉన్న శర్మ గారు, కొంచెం పద్దతి మరియు పట్టింపులు ఎక్కువ ఆయనకి)

ఏమండీ మాస్టారిగారింట్లో గేదె ఈనిందట, పాలు పంపిందామంటే మనకా పాడి లేదాయె (ప్రవాళం గారు వెనుక వీధి లో) అన్నట్టు మాష్టారు అంటే గుర్తుకొచ్చింది అయనకి పనస పొట్టు కూర అంటే మహా ఇష్టం. సాయంత్రం ఆ కూర వండి పంపరాదూ(ఆవిడ భర్త ఆచార్యులు గారు)

బావగారి ఇంట్లో పెద్ద గేదె ఈనిందంట..వాళ్ళకి పాలు సరిపోతాయో లేదో కొంచెం ఎక్కువ పంపించవొయ్ (దూరపు బంధువైనా అన్నింటికీ దగ్గరుండే సత్యం గారు)

కాంతం, కాంతం.. పిలుపు కీ పిలుపు కీ మధ్య జవాబిచ్చే సమయం ఇవ్వకుండానే మాస్టారిగారింట్లో గేదె ఈనిందంట అని బొంగురు గొంతు తో సెట్టి గారు కొట్టుకి వచ్చిన ఖాతాదార్లని (కష్టమర్లని) మరిచి మరీ పరుగెత్తేరు ఇంట్లోకి....పంచె కట్టు ఎగేసుకొంటూ
సర్లెండి మీ సంభడం! బెల్లానికి మన దగ్గరికే వస్తారు గా? కొంచెం చూసి వెయ్యండి తూకం, కాటా క్రింద చింత పండు తీసి. శెట్టి గారి సంభరానికో చిన్న చురక వేసింది భార్య సూర్య కాంతమ్మ గారు.

బాబయ్యా గేదె ఈనిందంట కదా... దారిన పోయే చాకలి, మంగలీ..
ఇలా నీది నాదీ అని బేధం లేకుండా అందరికీ అదే సందడి..మర్మం లేని సంతోషం...
ఇలా క్షణాల్లో విషయం వూరందరికీ తెలిసిపోయేది. సాయంకాలానికల్లా చిన్న పెద్ద చెంబులు, గిన్నెలతో పాలు ఇంటికి చేరేవి.
ఇక చూడాలి ఆ తరువాత అమ్మమ్మ కష్టం. బెల్లం తరిగి పాలను ముట్టి పాలతో కలిపి యాలకులు, మిరియాలు పొడి చేసి కలిపి, ఎవరిగిన్నెలలో చెంబులలో వాళ్లకి ఆ పాలను పోసి జున్ను వండేవారు.
పాలు పంపినా పంపకున్నా బేధం లేకుండా వాళ్ళ భాగం వాళ్ళకే.

ఆ తరువాత కష్టం నాది. వాళ్ళ వాళ్ళ గిన్నెలు, చెంబులు, వాటాలు పంచటం నా వంతు.
అమ్మమ్మ జున్ను వండటానికి కష్ట పడటం కాని, విసుక్కోవటం కాని నేనెప్పుడూ చూడలేదు!
ఒక సాంఘిక బ్యాధ్యత గా తీసుకొనేవారు
నేను మాత్రం చాలా విసుక్కోనేవాడ్ని ఆట వదలి పంచటానికి వెళ్లాలంటే.
కానీ అ పంపకం లో నేను కూడా ఆనందాన్ని చవి చూసిన దాఖలాలున్నాయండోయ్
పదేళ్ళ నా అ వూరి జీవితం లో జున్ను కోసం పాలు కొనటం అనేది నాకసలు గుర్తే లేదు.

ఏ పూట పితికిన పాలతో ఆ పూటే జున్ను వండేసేవారు.

ఇంచు మించు విధి గా ఆ వీధి లో వెళ్ళే వాళ్ళందరికీ భాగం ఉండేది.
తమ వంతు వస్తే వాళ్ళు కూడా తిరిగి అలాగే చేసేవారు మరి!
పెరట్లో కాసిని కాయో, పండిన పండో.. ఇలా ఏదో ఒకటి....పంచు కోవటం
తమ వంతు వస్తే చేయటానికి వెనుకడుగు వేయాల్సి వస్తే మాత్రం దాన్ని ఒక అవమానం గా భావించేవారు.
అది ఓ పరస్పర సాంఘిక భాంధవ్యం. ఎలా పుట్టిందో, ఎలా వృద్ధి చెందిందో నాకు ఇప్పటికీ అర్ధం కాదు కానీ,
ఎలాగైతేనేం స్వార్ధం పాళ్ళు మాత్రం చాలా తక్కువ.

అప్పుడు గుర్తుకు వచ్చింది నాకు ఆధునికీకరణ అంటే ఏమిటని!
అనాటి పంపకాలు, వస్తు మార్పిడి విధానాల్ని ఈ నాటి సర్ది పెట్టె మార్చిందేమో
అనాటి ఉమ్మడి కుటుంభాల్ని,సంఘు జీవనాన్ని ఈనాటి ఒంటరి స్వార్ధ పూరిత జీవితం మార్చింది
అనాటి గ్రామ కట్టుబాట్లని అలవాట్లని ఈనాటి సాంకేతిక ఆధునికీకరణ మార్చింది
అనాడు కూడు గూడు నీడ కోసం పడే తాపత్రయాన్ని ఈనాటి మితం లేని ధనార్జన మార్చింది
అనాడు కష్ట సుఖాలు ఒకరికొకరు చర్చించుకొని మనో భారాన్ని తేలిక పరుచుకొనే వారు
ఈనాడు దూరదర్శిని కాలక్షేపం ఆ కష్ట సుఖాలను చర్చించుకొనే సమయం/అవకాశం లేకుండా చేసింది

ఇంతలో గణ గణ మ్రోగింది నా చెవిలో. ఆ వూరి గుడి గంట కాదండోయ్.
నా చేతిలో ఉన్న చిత్ర విచిత్ర దూరవాణీదర్శిని... అదేనండీ స్మార్ట్ ఫోన్.
ఎత్తీ ఎత్త గానే, ఎక్కడున్నారు? అవతల నా భార్యామణి.
మావయ్యగారింట్లో!
ఇంకా అక్కడే ఉంటే మిగతా వాళ్ళను ఎప్పుడు పలుకరిస్తారు, ఎప్పుడు తిరిగి వస్తారు?
అబ్బబ్బ ఎక్కడికి వెళితే అక్కడే ఉండిపోతారు....మనకున్నది కొన్ని రోజులే. ఇక్కడ ఉండిపోవటానికి రాలేదు కదా!
అన్నీ గుర్తు చెయ్యలేక చస్తున్నాను... అన్నీ చూసుకొని తొందర గా రండి ....వింటున్నారా?
అన్నింటికీ ఊ కొడుతున్నాను యాంత్రికంగా
అవును నేను కూడా ఈ సాంకేతిక ఆధునికీకరణా స్రవంతి లో ఒక అడుగు ముందుకు, ముందే వేసి ఉన్నాను కదా మరి !
ఇంతకీ ఇప్పటి నా గురించి చెప్పనేలేదు కదూ...
పదవ తరగతి వరకు ఈ వూరి లో చదివి, తరువాత పై చదువుల కోసం వూరు, జిల్లాలు దాటి, ఉద్యోగం కోసం రాష్ట్రం, దేశాలు దాటి అమెరికాకు వచ్చిన ఓ ప్రవాసాంధ్రుడ్ని.

మనసు ఆ వూరి చుట్టూ తిరుగుతున్నా వెళ్ళలేని, వెళ్ళినా ఉండలేని నా విచిత్ర మనఃస్వభావం ఓ త్రిశంకు స్వర్గాన్ని తలపిస్తూ ఉంటుంది.

-- శ్రీరాజ్